“నేనొక పదిరోజులు మా పెద్దమ్మగారి వూరు వెళ్ళొస్తాను” అంది.

“వెళ్ళు” అన్నాడు అతడు క్లబ్‌కి బయల్దేరుతూ.

ఆమెకి ఉక్రోషమొచ్చింది. కాస్త  దుఃఖం కూడా కలిగింది. ఆ రోజెందుకో అతడిని నిలదీసి చాలా ప్రశ్నలు వేయాలనిపించింది. తను ఆ ఇంట్లో వుండటానికీ లేకపోవటానికీ తేడా ఏమీ వుండనట్టు అతను మాట్లాడటం ఆమెకి కోపాన్నీ బాధనీ కలిగించింది.

ఆ ప్రశ్నే అడిగింది. అతడామెవైపు ఆశ్చర్యంగా చూశాడు.

భార్య అలా మాట్లాడటం, అన్ని ప్రశ్నలడగటం మొదటిసారి. ఆగి నిదానంగా “నీకు వెళ్తే బావుంటుందా? వెళ్ళకపోతే బావుంటుందా?” అని అడిగాడు.

“మీకేది బావుంటుంది?”

“రెంటికీ పెద్దగా తేడా వుండదు”

లాగిపెట్టి కమ్చీతో కొట్టినట్టయింది. కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి. అదురుతూన్న పెదవుల్తో ఏదో ఆవేశంగా అనబోయింది.

అతడు గుమ్మం దగ్గిర ఆగి “వెళ్ళాలనుకున్నది నువ్వు. వెళ్తే బావుండేది నీకు. నాకేదైనా ఒకటే అయినప్పుడు వెళ్ళటం కోసం ఇంత వాదన దేనికి?” అని అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

ఆమె ఆ సాయంత్రమే ఊరు బయల్దేరింది. అతనికి ఫోన్ చేసి కూడా చెప్పలేదు. అతనన్నట్టు చెప్పినా చెప్పకపోయినా తేడా ఏమీ వుండదు. అతడు స్టేషన్‌కి రావటమన్న ప్రసక్తే లేదు.

రాత్రి తొమ్మిదింటికి రైలు బయల్దేరింది.

అయితే గంట ప్రయాణం చేశాక విద్యార్థులు దాన్ని ఆపుచేశారు. మరుసటిరోజు బంద్ అట. దానికి ప్రారంభంగా ఈ రైల్‌రోకో కార్యక్రమం.

రైలు తిరిగి బయల్దేరిన చోటికే వచ్చేసింది. ఆమె ఇంటికొచ్చేసరికి రాత్రి పన్నెండయింది

గేటు తీసుకుని లోపలికి వెళ్ళబోతూ విద్యుద్ఘాతం తగిలిన దానిలా ఆగింది.

లోపల్నుంచి రెండు స్వరాలు వినిపిస్తున్నాయి. ఒకటి తన భర్తది, రెండోది ఎవరో స్త్రీది. హోటల్‌లో కలిసిన అమ్మాయిది కాదు. వేరే ఇంకో అమ్మాయిది. "డూ యూ లవ్‌మి?" అని అడుగుతోంది. "ఐ డోన్ట్ లవ్ ఎనీబడీ" అంటున్నాడు.

ఆమె శబ్దం కాకుండా వెనుదిరిగింది. స్టేషన్ నుంచి తీసుకొచ్చిన ఆటో ఇంకా అక్కడే వుంది. అదెక్కి అడ్రసు చెప్పింది.

పావుగంట ప్రయాణం చేసి ఆటో ఆమె చెప్పిన చోట ఆగింది. దిగి డబ్బులు చెల్లించి మెట్లెక్కి బెల్ కొట్టింది.

అర్థరాత్రి దాదాపు ఒంటిగంట అవుతూండగా కాలింగ్ బెల్ కొట్టిన లక్ష్మిని చూసి ప్రహసిత్ అవాక్కయ్యాడు.

ఆమె స్థిరంగా, క్లుప్తంగా "ఈ రాత్రి నేను ఇక్కడ మీతో గడపదల్చుకున్నాను" అంది. అదే ఆఖరినిర్ణయం అన్నట్టు దాన్ని ఎవరూ మార్చలేరన్నట్టు చెప్పింది.

క్షణం తటపటాయించిన అతడు ఆమె లోపలికి రాగానే తలుపు వేసేశాడు.

## ఆరో అధ్యాయం

ఆపరేషన్ థియేటర్‌నుంచి బయటకు తీసుకొచ్చిన రెండు గంటలకు రాజుని కలుసుకుంది మధూహ.

మరో వారంరోజుల్లో అతడికి చూపు స్పష్టంగా వస్తుందని డాక్టరు చెప్పాడు.

మరుసటి రోజు అతడిని ఆస్పత్రినుంచి డిశ్చార్జి చేశారు. డాక్టర్లు చెప్పినట్టే వారంరోజుల్లో అతడు మామూలు మనిషయ్యాడు. అయితే ఆసిడ్ వల్ల కలిగిన నల్లటి మచ్చలు మాత్రం మొహంమీద నుంచి పోలేదు. అది పోవాలంటే ప్లాస్టిక్ సర్జరీ చేయాలనీ, దానికి పాతికవేల రూపాయలదాకా ఖర్చవుతుందనీ ఆస్పత్రిలో చెప్పారు.

"డాక్టర్ విశాల్ బాగా సంపాదిస్తున్నంత కాలమూ మనకి డబ్బు సమస్య కాదు" అన్నాడు రాజు నవ్వుతూ.

" నేనూ అదే అడుగుదామనుకుంటున్నాను. నువ్వు బెదిరించగానే డాక్టర్ విశాల్ ఎందుకు పదిహేనువేలు ఇచ్చాడు?"

రాజు నవ్వుతూనే "అది ప్రొఫెషనల్ సీక్రెట్, చెప్పను" అన్నాడు.

" ప్రేమలో రహస్యాలుంటాయా?" అంది అతడి మొహాన్ని తనవైపు తిప్పుకుంటూ.

రాజు మొహంలో నవ్వు మాయమైంది "ఆ ఒక్కటీ అడక్కు" అన్నాడు.

" పోనీ వద్దులే" అంది. ఇక ఆ విషయాన్ని బలవంతపెట్టటం ఇష్టం లేనట్టు.

"కానీ వందరూపాయలేమిటి? ఆ విషయం చెప్పు. అది కూడా రహస్యమా?".

"అందులో రహస్యం ఏముంది? పేపర్లలో ప్రకటనలు కూడా ఇస్తున్నాం కదా! చూడటం లేదా?".

" పేపర్లో ప్రకటనలు ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది.

"స్పెర్మ్ డొనేషన్. రక్తదానంలాగే స్పెర్మ్ కూడా అమ్మవచ్చు. సంతానోత్పత్తి కేంద్రాలు వాటిని కొనుక్కుంటాయి. పిల్లలు కలగని దంపతులు కోరితే వారికి వారి అనుమతితో కృత్రిమ గర్భధారణ కోసం ఆ వీర్యాన్ని అమ్మేవాళ్ళుంటే వాళ్ళు మా

దగ్గిర రిజిస్టరు చేసుకోవచ్చు. ఒకసారి స్పెర్మ్ ఇస్తే వందరూపాయలు పారితోషికం ఇస్తాం. ఇందులో రహస్యం ఏమీలేదు. పత్రికల్లో చూడలేదా ఎప్పుడూ?".

మధూహకి సంతానోత్పత్తి కేంద్రాల వరండాల్లో తారట్లాడే మగవాళ్ళు గుర్తొచ్చారు. ఆటోడ్రైవర్లు, రిక్షా తొక్కేవాళ్ళు.

"వాళ్ళా?" నమ్మశక్యం కానంత ఆశ్చర్యంతో అడిగింది.

" వాళ్ళు కాకపోతే ఎవరిస్తారు?"

ఆమె విస్మయం నుంచి ఇంకా తేరుకోలేదు.

రాజు అన్నాడు "దంపతులు కృత్రిమ గర్భధారణకి ఒప్పుకోగానే మేము వీళ్ళలో ఒకరికి కబురు చేస్తాం. కబురు చేయగానే రావాలి. బాత్‌రూమ్‌లో కెళ్ళి స్పెర్మ్ తీసి ఇవ్వాలి. హైద్రాబాద్‌లోని ఖరీదైన ఆస్పత్రుల్లో కూడా బాత్‌రూమ్‌లో నిల్చొని హస్తప్రయోగం చేసుకోవాలి. అదంతా చాలా విసుగైన వ్యవహారం. బాగా చదువుకున్న వాళ్ళు, మంచి పొజిషన్‌లో వున్నవాళ్ళూ వంద రూపాయలకి రారు. వీళ్ళే వస్తారు".

"మరి దంపతులకి ఈ విషయం తెలుసా? తమకి ఎవరి వల్ల సంతానం కలుగుతుందో?".

" తెలియకపోవచ్చు, దాత ఎవరో మేం చెప్పం. వాళ్ళు కూడా దాని గురించి అంతగా పట్టించుకోరు. అప్పటికే వాళ్ళు చాలా డిప్రెస్డ్ స్టేజిలో వుంటారు. ఇదంతా రకరకాల స్థాయిల్లో వుంటుంది. పెళ్ళయిన మూడు నాలుగేళ్ళకి అత్తగారి తరఫునుంచి సణుగుడు మొదలవుతుంది. అప్పుడు డాక్టర్‌ని సంప్రదిస్తారు. మొదట్లో భర్త వలన సంతానం కలగాలని అడుగుతారు. దీన్నే ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ బై హజ్బెండ్ అంటాం. అది ప్రయత్నిస్తాం. అంటే భర్త తాలూకు వీర్యాన్ని భార్యలోకి ఇంజెక్ట్ చేయటం. కానీ అదికూడా ఫలితం లేకపోవచ్చు. ఎందుకంటే సంతానం కలగకపోవటానికి చాలా వరకూ పురుషుడే బాధ్యుడు. కానీ ఈ విషయాన్ని వప్పుకోవటానికి మొగవాడి అహం అడ్డొస్తుంది. అతడిమీద పరీక్షలకి వప్పుకోడు. దానివల్ల వచ్చేలాభం కూడా అంతగా వుండదు".

“కానీ మీరుపయోగించేది రైల్వే కూలీలు, నిరక్షరాస్యులు, జెనిటికల్‌గా తక్కువ తెలివితేటలున్నవారి....” అంటూన్న ఆమె మాటలు మధ్యలో ఆపుచేస్తూ...

“భారతదేశంలో స్పెర్మ్‌ని నిలువ వుంచటానికి కావలసిన అత్యాధునికమైన పరికరాలు లేవు. నేను ముందు చెప్పినట్లు విద్యావంతులు, ఎక్కువ ఐక్యూ వున్నవారూ ఫోన్ చేసి పిలవగానే రారు” అన్నాడు .

“డాక్టర్ విశాల్ వల్ల మాకు సంతానం కలిగింది అని పేపర్లలో చెప్పుకుంటూన్న దంపతులు ఇలా సంతానయోగం పొందినవారేనా?”

“కాదు” రాజు మాటల్లో గర్వం తొణికిసలాడింది “కేవలం విశాల్ క్లినిక్ ద్వారా మాత్రమే దంపతులు భర్త వల్ల సంతానం పొందుతారు”.

ఆమె అర్థం కానట్టు “ఎలా” అంది.

“డాక్టర్ విశాల్ దైవాంశ సంభూతుడు. కేవలం ప్రజల కష్టాలు తీర్చటం కోసమే దేవుడు తనని పుట్టించాడని మనస్ఫూర్తిగా నమ్ముతాడు. ప్రతిరోజూ రెండు గంటలు దైవప్రార్థన చేస్తాడు. ఎందరో అతడికి కృతజ్ఞత తెలుపుకుంటూ ఉత్తరాలు వ్రాస్తారు”.

“కానీ కేవలం దైవప్రార్థన వల్ల పిల్లలు పుట్టరుగా?”

“ఎన్నో సంవత్సరాలుగా పిల్లలు పుట్టని వాళ్ళు ఎన్నోచోట్ల ఎన్నో విధాలుగా ప్రయత్నించి విఫలమైనవాళ్ళు డాక్టర్ విశాల్‌ని సంప్రదించి సంతానవంతులవటం నేను చూశాను. మిగతా ఆస్పత్రుల్లోలా కాకుండా భర్త వల్లే గర్భవతులవటం నేను స్వయంగా గమనించాను. అది అతడి చేతుల్లోని కళ అనుకుంటావో, దైవకృప అంటావో నీ ఇష్టం. వాస్తవాన్ని మాత్రం కాదనలేవుకదా. కావాలంటే విశాల్ క్లినిక్‌లో ట్రీట్‌మెంట్ పొందిన ఏ దంపతులనైనా ఈ విషయం నువ్వు అడగవచ్చు”.

మధూహ చాలాసేపటి తరువాత నవ్వింది “ ఏ దంపతులయినా తమకి బయటి వాళ్ళవల్ల పిల్లలు పుట్టారని చెప్పుకోరుగా. పెద్దయ్యాక ఇంకేవో పోలికలొస్తే ఏ మామయ్యవో తాతయ్యవో అని సంతృప్తి పడతారనుకుంటాను”.

రాజు మొహం జేవురించింది.

అతడిని తిరిగి మామూలు మూడ్‌లోకి తీసుకురావటం కోసం “పోనీలే నువ్వు చెప్పిందీ నిజమే అయివుండవచ్చు. ఇన్నాళ్ళూ సంతానయోగం లేదనుకున్న నా స్నేహితురాలు లక్ష్మి మీ క్లినిక్ వల్ల గర్భవతి అయిందిగా, ఆ ఋజువు చాలు” అంది.

“ఎవరా లక్ష్మి? మొన్న అబార్షన్ అయిన ఆమెనా?”

“నీకు గుర్తుందా?” అనుమానంగా అడిగింది.

“తెలుసు, ఆమెకి జీవితంలో సంతానవతి అయ్యే యోగం...” అంటూ నోరు జారానని గ్రహించి నాలుక్కర్చుకున్నాడు.

ఆమె స్థాణువై “ ఏమిటి నువ్వు చెబుతోంది?” అంది.

“ఏమీ లేదులే” అంటూ దాటవెయ్యబోయాడు.

ఆమె చప్పున అతడి చెయ్యి తీసుకుని నెత్తిమీద పెట్టుకుని “చెప్పకపోతే నామీద ఒట్టే” అంది.

“నన్ను బలవంతపెట్టకు. నేను పనిచేసిన ఆస్పత్రి రహస్యాలు బయటపెట్టటం నిజాయితీ అనిపించుకోదు”.

“అలా బయటపెట్టకుండా వుండటం కోసం యజమానిని బ్లాక్ మెయిల్ చేయటం నిజాయితీ అనిపించుకుంటుందా?”.

అతడు ముందు అయోమయంగా చూసి ఆ తరువాత ఆమె చెప్పింది అర్థమై “ లేదు, లేదు. దానికీ దీనికీ ఏ సంబంధమూ లేదు ”అన్నాడు. అతడు నిజమే చెపుతున్నాడనిపించింది.

మధూహ నిరాశగా "పాపం లక్ష్మి ఆ రెండునెలలూ ఎంత సంతోషించిందో" అంది తనలో తనే అనుకుంటున్నట్టు.

"చూశావా మరి, ఇదంతా పేషెంట్‌ని సంతోష పెట్టటానికే"

ఆ మాటతో అతడితో నిజం ఎలా చెప్పించవచ్చో ఆమెకి అర్థమైంది.

చేతిమీద చేయి వేస్తూ "నువ్వు చెప్పిందీ నిజమే. పూర్తిగా సంతానయోగం లేదన్న నిస్పృహ కన్నా ఇది మంచిదేగా" అంది.

"నువ్వు కరెక్ట్‌గా ఆలోచిస్తున్నావు"

"ఆమె కసలు సంతానయోగం లేదన్నావుగా. మరి ఇదెలా సాధ్యపడిందో చెప్పవా"
అభ్యర్థనగా అడిగింది.

"హార్మోన్ ఇంజెక్షన్స్"

"అంటే "

" ఆ ఇంజెక్షన్స్ ద్వారా పీరియడ్స్ తాత్కాలికంగా ఆగిపోతాయి. గర్భవతి అన్న ఆశ కలుగుతుంది. స్కానింగ్ ద్వారా దాన్ని నిర్ధారణ చేస్తాం. కానీ స్కానింగ్‌లో నిజం తెలుస్తుందిగా.

ఆ రిపోర్టు బదులు ఇంకో గర్భిణి స్త్రీని చూపిస్తాం. ఆవేమీ స్టూడియోలో తీసిన ఫోటోలు కావుగా. ఎవరివయినా చూపించవచ్చు. రెండుమూడు నెలల తరువాత డిశ్చార్జి కనపడగానే అబార్షన్ అంటాము. ఆ విధంగా వారిని సంతృప్తి పరుస్తాం".

'కాదు' దిక్కులు పిక్కటిల్లేలా అరవాలన్నా కోరికని అతికష్టంమీద ఆపుకుంది.

ఆమె మొహం కసితో కోపంతో నిస్సహాయతతో ఎర్రబడి కందిపోయింది. ఉక్రోషంతో కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

"మీరు వాళ్ళని సంతృప్తిపరచటం కాదు. మీ జేబులని సంతృప్తి పర్చుకోవటం కోసం చేస్తున్నారు. ఒక గొడ్రాలికి లేనిపోని ఆశలు కల్పిస్తున్నారు. గర్భం వచ్చిందని డబ్బులు తీసుకుంటున్నారు. మళ్ళీ అబార్షన్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. అన్నింటికన్నా ఘోరమైన మోసం ఏమిటంటే చిన్న ఆశ చూపించి వశీకరణ మంత్రం వేసినట్టు ఆమెని మీ చుట్టూ తిప్పుకుంటున్నారు. అన్ని ఆశలూ కోల్పోయిన స్త్రీకి మీరు దేవుడిలా కనిపిస్తారు. ఇక జీవితాంతం మీ చుట్టూ తిరుగుతూనే వుంటుంది. ఎప్పటికయినా తన కడుపులో జీవం పోసుకుంటూన్న చిన్నారి తొమ్మిదినెలలపాటు ప్రాణాలు నిలుపుకుని బయటికి రాదా అన్న చిరు ఆశతో తమ ఆదాయాన్నంతా మీకు సమర్పించుకుంటుంది. సిగ్గుగాలేదా? మిమ్మల్ని తల్చుకుంటూంటే మీకే అసహ్యంగా లేదూ?"

అతడు దగ్గిరకొచ్చి అనునయంగా ఏదో అనబోయాడు.

ఆమె అసహనంగా తల విదిలిస్తూ "నన్ను కొంచెం సేపు ఒంటరిగా వుండనివ్వు" అంది. ఏమనుకున్నాడోగానీ అతడు అక్కడనుంచి మౌనంగా వెళ్ళిపోయాడు.

## 2

సాయంత్రం అయిదున్నరయింది.

విష్ణు ఆ రోజు చాలా విసుగ్గా వున్నాడు. సంవత్సరం నుంచి వ్యాపారం బాగోలేదు. స్టాఫ్ జీతాలు ఇవ్వటం కూడా కష్టంగా వుంది. పళ్ళ బిగువున అదిమిపెట్టి లాక్కొస్తున్నాడు.

అతడు సాధారణంగా ఇటువంటి విషయాలు ఎవరితోనూ చర్చించడు. అతడికి జీవితంలో సంతోషాలకీ విషాదాలకీ పెద్దగా తారతమ్యం వుండదు. స్పందనల తేడా తక్కువ. అతడి మొహం ఆనందాన్ని గానీ విషాదాన్నిగానీ పెద్దగా చూపించదు.

ప్రస్తుతం అతడు ఒక రైల్వే కాంట్రాక్టు కోసం ప్రయత్నిస్తున్నాడు. అదిగానీ వస్తే కష్టాలనుంచి బయటపడినట్టే.

ఆ విషయమై ఎవరితోనో మాట్లాడుతు వుండగా మరోఫోన్ మ్రోగింది. ఎత్తి

“హలో” అన్నాడు.

“నేనూ లక్ష్మిని”

ఆమె సాధారణంగా ఆఫీసుకి ఫోన్ చేయదు.

“ఏమిటి?” అన్నాడు విసుగ్గా.

“ఈ సాయంత్రం ఖాళీగా వుంటారా?”

అతడు మొహం చిట్లించి “ఎందుకు?” అన్నాడు.

“చెప్తాను”

“ఉంటాను”

“అయితే తొందరగా రండి ఇంటికి వచ్చాక చెపుతాను” అని ఫోన్ పెట్టేసింది.

మరో గంట గడిచింది. ఆరున్నరకి మాధుర్ వచ్చాడు. సాయంత్రం పూట ఏ బార్‌లోనో కూర్చోవటం అలవాటు. మాధుర్ విష్ణుకి ఫైనాన్సియర్. అంతకన్నా ఎక్కువగా స్నేహితుల్లా వుంటారు.

“వెళ్దామా? ఏమైనా పనుందా?” అని అడిగాడు మాధుర్. విష్ణుకి అతడితో వెళ్ళాలనే అనిపించింది. వాళ్ళు రోజూ కలుసుకుంటూనే వుంటారు. అయినా ఇంకా ఏవో మాటలు ఉంటూనే వుంటాయి. తొందరగా ఇంటికి వెళ్తే నిజంగానే ఏమీ తోచదు.

కానీ ఆ రోజు భార్య రమ్మన్నదని గుర్తుంది. ఇంటికి ఫోన్‌చేసి రానని చెప్దామనుకున్నాడు. మళ్ళీ చివరిక్షణంలో మనసు మార్చుకుని “నువ్వెళ్ళు మాధుర్. నేనింటికి వెళ్తాను” అన్నాడు.

మరో పదినిముషాల తరువాత అతడు ఇంటికి వెళ్ళాడు. అప్పటికే లక్ష్మి తయారైవుంది. "మనం బయటకి వెళ్దాం" అంది. విష్ణు ఆశ్చర్యంగా "అందుకోసం రమ్మన్నావా? ఎక్కడి వెళ్ళాలి?" అని అడిగాడు.

"ఊరికనే బయటకి"

"ఊరికే బయటకు వెళ్ళటం కోసం రమ్మన్నావా?"

" ముందే అడిగాను. మీరు ఖాళీగా వున్నానంటేనే రమ్మన్నాను. అయినా ఇప్పుడు మీకంత కొంపలు మునిగిపోయే కార్యక్రమాలు ఏమున్నాయి గనుక?" అంది.

విష్ణు "సర్లె సర్లె" అంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. అతడిలో అదో మంచిగుణం వుంది. వాదన పొడిగించడు. మగవాడినన్న అహంకారం చూపించడు. ఒకటి రెండుమాటలన్నా పడతాడు.

ఇద్దరూ కలిసి బయల్దేరేసరికి ఏడయింది.

"ఎటు?"

"బ్లూఫాక్స్"

అతడు ఆమెవైపు తల తిప్పి "ముందు చెప్పొద్దా. నా దగ్గిర అంత డబ్బు లేదనుకుంటాను. ఇంటిగ్గానీ ఆఫీసుగ్గానీ వెళ్ళి తీసుకోవాలి" అన్నాడు.

"అఖ్ఖర్లేదు. నా దగ్గిరున్నాయి".